# మమకారం

ఎం. రామకోటి

కిరాతకుడి బాణపు దెబ్బ తగిలి నేల రాలింది క్రౌంచం. తనకోసం విలపిస్తూ గాలిలో వలయాలు తిరుగుతున్న ప్రియుడేమైపోతాడో అన్న ఆవేశం నిండిపోయిందా పక్షిచూపులో. అది చూసిన వాల్మీకి కలతబడ్డాడు. ఆ శోకం శ్లోకమై ఆ నోట పదపళ్ళు తొక్కింది. కలతపడ్డ వాళ్ళందరూ కలవరించలేరు.

పేవుమెంటు సంసారాల్లాగ రోజుకో యిల్లు మారుస్తుందట యీ తల్లి పిల్లి; పసి కందుల్ని తెచ్చి మాయింటిలో పడేసింది. కళ్ళు తెరవని రెండు వెన్నముద్దలు వంటింటిలో కంచాలముందు ముద్దలు తింటూ నట్టింట చిట్టడుగులేసుకుంటూ యిల్లంతా అంగలాలు తిరుగుతూ ముచ్చటగా పెరుగుతున్నాయి. రాను రాను ఒళ్ళు చేసి పూలబంతుల్లా తూగడం మొదలెట్టేయి. నల్లది మహచెడ్డ, నల్లమచ్చల తెల్లది మాత్రం మెత్తనిది. మెత్తనివాళ్ళ మొత్త బుద్ధి, అందుకే నల్లది అస్తమానూ దానిమీదపడి నానా హంగామా చేస్తూంటుంది.

వచ్చేపోయే ఎండ మబ్బుగా మసాబుగా వుంది. ఎదురుగా పచ్చపచ్చగా మరువంకుండీలు చామంతి మొక్కలు మందార గుబురు. లేచి ఎంతని ఎత్తిరిల్ల నియ్యడం లేదు. గదిలో కూర్చుని ఏవో కాయితాలు చూసుకుంటున్నాను.

వెల్లికిలా బబ్బుని బుల్లి గుప్పిళ్ళు విప్పి నాకుతూ అల్లంత ఎత్తులో తేలిపోతున్న మబ్బులవేపు ఆదేవనిగా చూస్తూ మురిసిపోతోంది నల్లమచ్చల తెల్లపిల్లి. వలసపోతున్న కొంగల గుంపులో గుమికూడిన కాకుల మూకలో అనుకుని సంబరపడిపోతోంది. అందొస్తాయేమోనని వుండుండి పంజా విసిరి ఉలిక్కి పడి తుప్పున ఎగిరి వెల్లకిలా పడి మళ్ళీ కలలు గంటోంది మబ్బుల తెర తొలగినపుడు వెలవెలబోతూ ఒరిగిపోతున్న అర చందమామని చూసి జారి పడుతున్న పెరుగు బిళ్ళ అనుకుని మాటి మాటికీ నాలిక చాచి పెదాలు తుడుచుకుంటోంది. చల్లగా పచ్చని నీడలో జారగిలబడి వింగిలో రంగులూ బొమ్మలూ చూసి మైమరచి పోతోంది.

ఉరకలు వేసే ఉత్సాహం లాంటిది నల్లది. తల్లి వంటిల్లు చక్కబెట్టుకుంటుంటే చాటూమాటుగా పక్కల మీద పిల్లి మొగ్గలేసే పిల్లల్లాగ - కటిక నేల మీదే ఓరగా ఒడుపుగా అతి సున్నితంగా తల ఆన్చి కాళ్ళు ముడుచుకుని అవలీలగా చిలిపి మొగ్గలేస్తోంది. ఆ కేరింతలకి నేల పులకించి దూదిపింజలా మెత్తబడి పోతోంది తోడబుట్టిన దానిమీద పడి ఆప్యాయంగా ఒళ్ళంతా ముద్దాడి కితకితలు పెడతోంది. నల్లమచ్చల తెల్లది కాళ్ళు చాచి మనసారా నల్లదాన్ని ఒడిలో దాచుకుని అభిమానంగా తల మీద నాకుతోంది.

చెంగున గెంతి కిటకటాల తలుపులు ఎక్కబోయి ఒకదాని మీదొకటి జాలిపడి కుమ్ములాడుకు పోతున్నాయి.

గాలివాటుకి మొక్కలు జలదరించేయి. గుమ-గుమ్మని మరువం గుభాళించింది. మనసు పట్టలేక పోయింది మందారం. కందిన కనురెప్పల్లా కెంపురెక్కలు విప్పి అంచులమీంచి మంచుబొట్లు బొటబొటా రాల్చింది.

ఒళ్ళు జల్లుమని నల్లనది ఎగిరి మందారం బొడ్డులో పుప్పొడిలోంచి పచ్చగా పొడుచుకొచ్చిన కాడని అందుకోబోయింది.... నోటికి దొరికి జారిపోయి దబ్బున పడింది.

"అయిందా పెళ్ళి....ఎందుకా ఎగురుబాటు?" అన్నట్టు మందారం తల ఆడిస్తూ వూగుతోంది.

తనని చూసి మందారం పకపక నవ్వుతోందని ఉడుక్కుంది నల్లది. నాలుగు కాళ్ళూ దగ్గరగా కూడతీసుకుని నడ్డి పైకెత్తి వింటిబద్దలా వంగి పూలబంతిలా గుండ్రంగా ఉబ్బిపోయి, గుర్రు పెట్టి కాలెత్తి పువ్వుని కొట్టబోయింది. ఇంతలో ఏదో వినబడి చెవులు నిక్కబెట్టి గోడ మీదకి చూస్తోంది. నల్లమచ్చల తెల్లది హఠాత్తుగా నేల మీద తోక చాపి లేచి గోడవేపు తిరిగి ఎవరి కోసమో ఎదురు చూస్తోంది, ఏం జరిగిందా అని తెల్లబోయేను.

''మ్యావ్-మ్యావ్!'' అంటూ సౌమ్యంగా పలకరిస్తూ ఒక్క దాటులో గోడ దూకి తల్లి, పిల్లల ముందు కూలబడింది. పక్కకి తిరిగి నేల మీద కాళ్ళు చాపుకుని వేటవాలుగా పడుకుంది.

ఒడిలో తలలు కూరేసుకు ఆవు రావురుమని పాలు తాగేస్తున్నాయి పిల్లలు. పిల్లల కడుపు నింపుతోందన్న తృప్తి నిండిపోయి మత్తుగా కళ్లెత్తిం తల్లి. దిక్కుల్నీ చుక్కల్నీ పుణికి పుంగరించి పిల్లలకి వస పడుతున్నానన్న గర్వం తొణికిస లాడుతోంది ఆ చూపులో.... పిల్లల ఒళ్ళంతా నాకుతూ వెచ్చని మక్మల్ పొత్తిళ్ళలాంటి పాదాలు మడిచి తలలు నిమురుతూ ముద్దు ముద్దుగా పిల్లల్ని లాలిస్తోంది, మస్తుగా పాలు తాగి మ్యావ్-మ్యావ్ అంటూ——

"మమ్మల్ని ఒదిలేసి ఎక్కడికెళ్ళి పోయావే అమ్మా? ఎక్కడికీ వెళ్ళిపోకే! మా దగ్గిరే వుండిపోవే!" అన్నట్టు ఒడిలో చేరి, మెడ మీద పెనవేసుకుని మొహం మీద మొహం పెట్టి గారంగా మారాం చెస్తున్నాయి పిలలు.

ప్రకృతి రమ్యరమ్యంగా వుంది. సృష్టి తియ్యగా తేనె కుండలా కనువించింది. మాటలకి అందని మధురానుభూతి ఏదో మనసుని హత్తుకుంది.

"ఏవిటా మంద మరుపూ? ఆఫీసుకి టైమై పోతుంటేనూ....లేవండి ...మడి గట్టుకోండి!" అని మా ఆవిడ వంటింట్లోంచి విసుక్కుంటే తుళ్ళిపడి తెప్పరిల్లేను.

రెండు మూడు కుటుంబాలు కలిసి వున్న తంజావూరు సత్రవు పంచ యిల్లు. ఎవరెవరు ఎందుకు వస్తున్నారో ఎవరి కోసమో మరొకరికి తెలియదు ముష్టి వాళ్ళకీ, కుక్కలకీ రహదారి. భోంచేసి చేతులు కడుక్కుంటున్నాను.

భౌ-భౌ మంటూ కుక్కలు మొరుగుతున్నాయి. పిల్లులు కళ్ళముందాడ కంగారు పడ్డాను.

"ఏవండోయ్! కుక్క ముండలు.... మన పిల్లుల్ని....వెర్రి ముండ....." అంటూ ఆయాస పడుతూ, గంగిరెత్తిపోతూ వంటింట్లోంచి గుమ్మం వేపు తొంగి చూసి గుండెలు బాదుకుంటోంది మా ఆవిడ.

చేతిలో చెంబు దభీమని వదిలేసి తువ్వాళపై మీద వేసుకుని విడిపోతున్న పంచ చుట్టబెట్టుకుంటూ పరిగెత్తేను. జమా జెట్టీల్లాంటి నాలుగు వూరకుక్కలు పోలీసుల్లా తల్లి పిల్లిని నలువేపులా చుట్టుముట్టేయి. తప్పించుకు తిరుగుతూ దొరికిపోయిన రాజద్రోహిలా తల్లి బెదురు చూపులు చూస్తోంది. తన వునికి పోలీసు కుక్కలకి ఎలా తెలిసి పోయిందా అని తెల్లబోతోంది. సందు దొరికితే చాలు దాటిపోదామని సందు కోసం అటూ యిటూ దొంగచూపులు చూస్తోంది. మొక్కల మాటున నక్కి బిక్కచచ్చి పోతున్నాయి పిల్లలు. పద్మవ్యూహంలో చిక్కుకుని చెలరేగిన అభిమన్యుడిలా పంజా విసురుతూ వ్యర్థప్రయత్నం చేస్తోంది తల్లి పిల్లి. దుష్టచతుష్టయంలా వికృతంగా కోరలు యికిలించి మీదకి వురకబోతున్నాయి కుక్కలు. మధ్యకి వెళ్ళి కేకలేసి చేతుల్తో అదమాయించబోయేను. కాపలా కాస్తున్న రెండు కుక్కలు——


"డ్యూటీ చేస్తున్నాం సార్! అడ్డు రాకండి మాట దక్కదు. తప్పుకుంటారా, తన్నమంటారా?.కబడ్దార్!....." అన్నట్టు బౌయ్-బౌయ్ మని తిరగబడి కరవబోయేయి.

చేతిలో ఏమీ లేదు. కుక్క కాటుకి చెప్పు దెబ్బలు సరిపోవు. ఇంజక్షన్ల పోట్లూ, డాక్టర్ల కాట్లూ పడిచచ్చే కలగాయాలి. వంకేను కర్ర కోసం లోపలికి వెళ్ళి తిరిగొచ్చేసరికి ఒక కుక్క నోట్లో తల్లిపిల్లి గిజ-గిజ గింజుకుంటోంది.... ఒళ్ళు మండి కర్ర ఎత్తేను. తప్పించుకుని వీధిలోకి దాటిపోయేయి కుక్కలు. గావు కేకలేసి తరుముకుంటూ వీధిలోకి పరిగెత్తేను. నా కంగారూ గావుకేకలూ చూసి దారిన పోయేవాళ్ళు కుక్కల్ని చుట్టు ముట్టేశారు. కొరకొరా చూస్తూ, గుర-గురలాడి గుంపు చుట్టూ గారడీ వాడిలా తిరుగుతున్నాయి కుక్కలు. కుక్క నోట్లో రక్తం కక్కుతూ వూగిసలాడుతోంది పిల్లి. మృత్యుముఖంలో విషపు కోరల మధ్య చిక్కుకుని నరాలు మెలకబడి మెడకరాలుమని, ఊపిరి సలపక నలుగురి మధ్యా అసహాయంగా దిక్కుమాలిన చూపులు చూస్తోంది. ఆ మరణబాధ భరించలేక నోరు తెరవలేక హృదయ విదారకంగా మూలుగుతోంది. కసాయి కుక్కల్ని చూసి కంపరమెత్తిపోయింది. కోపం పట్టలేక నడ్డి మీద కర్రతో కసితీరా ఒక్క బాదు బాదేను. కుయ్యో-కుయ్యో మంటూ పిల్లిని కింద పడేసి కాళ్ళ మధ్యనుండి దూరి పారిపోయిందా కుక్క. మిగిలినవి తిరగబడబోయి అందరివేపూ మొరలెత్తి——

"మూలమూలల పందికొక్కుల్ని పట్టి యీడ్చి....చీల్చి చంపుతోంది పిశాచం లాగ....పాపం! అవేం చేశాయసీ? వాటి బతుకు అవి బతుకుతున్నాయి - అమవుగా దొరికేయని. ఎలాంటి ఘోరాలు చేస్తోందీ దుర్మార్గురాలు!....దొరక్క-దొరక్క ఇన్నాళ్ళకి దొరికింది వదిలేస్తాంవా?.... మర్యాదగా పట్టుకోబోతే తిరగబడి మమ్మల్నే చంపబోయింది. ఆత్మరక్షణ కోసం చంపేస్తాం మరి....ఏం చేస్తాం?" అన్నట్టు భౌ-భౌమని మొరిగేయి.

ఇవి కూడా పేపర్లు చూస్తున్నాయా అనిపించింది. ఉండబట్టలేక కొందరు కుక్కల్ని డొక్కల్లో తన్ని తరిమేసేరు.

"ఎంత పని చేసేయీ... వెధవ కుక్కలూ!....రామరామ!" అని జాలి పడుతూ కొందరూ "ఎన్ని జీవాల్ని పొట్ట బెట్టుకుందో పాపిష్టి ముండ!.... యివాళ కుక్కలకి దొరికి పోయింది'



అంటూ కొందరూ ఎవరి తోచింది వారనుకుంటూ, ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయేరు.

నడివీధిలో రక్తం మడుగులో పొర్లుతోంది పిల్లి. సగం తెగిపోయిన మెడ విరిగిన జొన్న కంకిలా వేలాడుతోంది. ఎదురింటి వాళ్లెవరో చెంబుతో నీళ్లు తెచ్చి నోట్లో పోసేరు. మింగబోయి ఏ నరం తోడుకుపోయిందో గుండె కొరికేసేలా మ్యావ్ అని మెడ వాలేసి దీనాతి దీనంగా చూస్తోంది. ఆ చూపులో చావంటే బెదురులేదు, బాధ లేదు. తను దిక్కుమాలిన చావు చస్తున్నందుకు దుఃఖంలేదు. కాపాడమని ప్రాధేయపడడం లేదు. ఆ చూపులో ఏదో వినబడుతోంది. దాని గుండెని పిండేస్తున్న బాధ స్పందిస్తోంది. అది చివరి ఘడియలో ముంచుకొచ్చే భయం మాత్రం కాదు, కరుగుతున్న కళ్ళల్లో వేదన వుబుకుతోంది. తను కన్నుమూస్తే ఇప్పుడిప్పుడే కళ్ళు తెరుస్తున్న పసికందులేమైపోతాయో ఎంత విలవిల లాడిపోతాయో అన్న ఆ వేదన చిమ్ముతోంది.

ఆ శోకం పొంగి పొరలి పోతోంది.

పిల్లి పిల్లలు మామూలుగా చెలగాటాలాడుకోవడం లేదు. తల్లికోసం బెంగ మొహాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గుమ్మంలో కూర్చుని ఎదురు చూస్తున్నాయి, ఆ చూపుల్లో తల్లే నిండిపోయింది. దాని ఆఖరి చూపు నాగుండెల్లో గుచ్చుకుంది.

కలతబడిన వారందరూ, కలవరబడినా పలకరించలేరు. గుండె నిండిన వాళ్ళందరూ పాడలేరు, అది చేతగాక లోలోన కుమిలిపోతారు! *